క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



పాన్‌గల్: మండలంలోని కేతేపల్లికి చెందిన ఐదుగురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను బుధవారం కాంగ్రెస్ నాయకులు విష్ణు, సింగిల్ విండో డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, రాజుగౌడ్ అందించారు. గ్రామానికి చెందిన భూతగళ్ల శశిరేఖకు రూ.17,500, సంగనమోని సరోజకు రూ.28,500, సంగనమోని అంజనమ్మకు రూ.36 వేలు, సుధావేణికి రూ.21వేలు, మంజులకు రూ.21 వేల చెక్కులు మంజూరైనట్లు వారు పేర్కొన్నారు. చెక్కులను మంజూరు చేయించిన మంత్రి జూపల్లికి, మంజూరుకు కృషి చేసిన మండల నాయకులకు బాధిత కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, టక్కు శ్రీను, బీరయ్య, వెంకటస్వామి, గ్రామస్తులు పాల్గొన్నారు.

4 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వీపనగండ్ల: మండలంలోని తూంకుంట వాగు నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఇసుకను తరలిస్తున్న 4 ట్రాక్టర్లను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ చంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం అర్ధరాత్రి తూంకుంట వాగు నుంచి ఇసుకను తరలిస్తుండగా కల్వరాల గ్రామంలో తూంకుంటకు చెందిన వెంకటేష్, బాలపీరు, సంపత్‌రావుపల్లికి చెందిన కరిక ఉస్సేన్, శివకృష్ణ ట్రాక్టర్లను అదుపులోకి తీసుకొని డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఏఎస్‌ఐ హెచ్చరించారు.

నేడు రైతు ధర్నా

అమరచింత: పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించే చట్టం చేయాలని కోరుతూ హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద గురువారం జరిగే రైతు ధర్నాను జయప్రదం చేయాలని ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న కోరారు. ఈనెల 8న అఖిల భారత ఐక్యరైతు సంఘం ఆల్ ఇండియా కమిటీ ఆధ్వర్యంలో రైతు, రైతుకూలీల సమస్యలపై దేశంలో అన్ని రాష్ట్ర రాజధానిల్లో ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు అన్ని రకాల పంటలకు ఎంఎస్‌పీని చట్టబద్ధం చేయాలని, చిన్న, సన్నకారు, మధ్య తరగతి రైతులకు పూర్తి రుణమాఫీ చేయాలన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ యొక్క పరస్పర సుంకాలకు లొంగొద్దని, విద్యుత్ సవరణ బిల్లును రద్దు చేయాలని, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలని నిర్వహించే ధర్నా కార్యక్రమంలో రైతులు, రైతు కూలీలు పాల్గొనాలని కోరారు.

తాగునీటి కోసం 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయం నుంచి తాగునీటి కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నారు. బుధవారం నాటికి పూర్తి స్థాయి నీటిమట్టం 1,021 అడుగులకు గాను 1,015 అడుగులకు చేరింది. జూరాల ఎడమ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశామని ఏఈ వరప్రసాద్ తెలిపారు. రామన్‌పాడు ఎడమ, కుడి కాల్వ ద్వారా 12 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

గడ్డి, బోరు మోటారు దగ్ధం



వనపర్తి రూరల్: మండలంలోని కడుకుంట్ల గ్రామానికి చెందిన కుమ్మరి కోటమ్మ, జమదగ్ని వ్యవసాయ పొలంలో ఉన్న గడ్డి కట్టలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించడంతో గడ్డి కాలి బూడిదయ్యింది. బుధవారం విషయం తెలుసుకున్న రైతులు ఘటన స్థలానికి చేరుకొని గడ్డితో పాటు పొలంలో ఉన్న బోరు మోటారు పైపులు కాలిపోవడం చూసి కన్నీటి పర్యంతమయ్యారు. ఘటనలో రూ.లక్ష వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితులు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల నమోదు



ధరూరు: మద్యం తాగి వాహనం నడిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ శ్రీహరి అన్నారు. బుధవారం సాయంత్రం మండల కేంద్రంలో వాహనాల తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన వారిపై డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రజలు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు.

యూరియా వాడకం తగ్గించాలి

- శాస్త్రవేత్తలు సుధాకర్, సిద్ధప్ప, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్
- జీలుగతో పోషకాలు మెండు
- పంట మార్పిడి తప్పనిసరి



పామిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్‌నాయక్

కొత్తకోట రూరల్: పంటలకు యూరియా వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులు వాడాలని జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ సుధాకర్ సూచించారు. రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా బుధవారం పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లిలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వానాకాలంలో వరి పండిస్తే యాసంగిలో ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలన్నారు. పంట కోతల తర్వాత జీలుగ వేసి దుక్కి చేయడం ద్వారా ఎరువుల వాడకం 50 శాతం వరకు తగ్గించొచ్చని వివరించారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచన మేరకు క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలని సూచించారు. విత్తనశుద్ధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షల ప్రాముఖ్యత, నీటి యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు శశిభూషణ్, మాధురి, ఎంఏఓ సైదులు, ఏఈఓలు మధు, అర్చన, కృష్ణయ్య, సింగిల్ విండో చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, డైరెక్టర్లు - నరేష్, వెంకటయ్య, మాజీ జెడ్పీటీసీ వెంకటస్వామి, మాజీ సర్పంచ్‌లు సిద్ధయ్య, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



చిట్యాల రైతువేదికలో..

సేంద్రియ ఎరువులు వాడాలి

వనపర్తి రూరల్: సేంద్రియ సాగుతో అధిక దిగుబడులు సాధించడమే కాకుండా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను ప్రజలకు అందించొచ్చని పాలెం వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్త డాక్టర్ సిద్ధప్ప పేర్కొన్నారు. మండలంలోని చిట్యాల రైతువేదికలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అధునాతన వ్యవసాయ పద్ధతులు అవలంబించి పెట్టుబడి వ్యయం తగ్గించుకోవాలని సూచించారు. పంటలకు సరైన మోతాదులోనే రసాయనిక ఎరువులు వాడాలని, అధికంగా వాడితే భూమికి మేలు కలిగించే కీటకాలు చనిపోతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రావు, మార్కెట్ డైరెక్టర్ శాంతన్న, ఏఈఓ అనువల్య, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వీపనగండ్లలో వడదెబ్బపై కూలీలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

పాన్‌గల్: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను ఎంపీడీఓ గోవింద్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాలం దృష్ట్యా కూలీలకు ఇబ్బందులు కలుగకుండా పనుల వద్ద నీడ, తాగునీరు తప్పక ఏర్పాటు చేయాలని సిబ్బందికి ఆదేశించారు. దీంతో పాటు కూలీలు కూడా ఉదయం వేళలో పనులకు త్వరగా వచ్చి ఎండ తీవ్రత పెరగక ముందే ఇంటికి చేరుకోవాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ఈసీ అంజన్‌రెడ్డి ఉన్నారు.

వడదెబ్బ నివారణపై కళా ప్రదర్శన

వీపనగండ్ల: గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీ పనికి వెళ్తున్న వారికి తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు బుధవారం వడదెబ్బ నివారణపై అవగాహన కల్పించారు. మండల కేంద్రంలో ఉపాధి కూలీలకు తమ ఆటపాటల ద్వారా వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను కళాకారులు వివరించారు. అలాగే ప్రభుత్వం ప్రవేశ పెట్టిన 6 గ్యారంటీలు, రాజీవ్ యువవికాసం, సైబర్ నేరాలు, తదితర అంశాల గురించి తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రమేశ్‌రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ శిల్ప, కళాకారులు బోనాసి రాజు, నర్సింహ, కృష్ణయ్య, శ్రీనివాసులు, సువర్ణ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాల సారథి అరుణ్



మదనాపురం: అరుణ్ 17వ వర్ధంతిని పురస్కరించుకొని మండలంలోని అజ్జకొల్లులో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆయన స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి వెంకట్రాములు మాట్లాడుతూ.. నిరంతరం ప్రజా ఉద్యమాల్లో ఉండి ప్రజలను ఏకం చేసి ఉద్యమాల వైపు నడిపించిన అరుణ్ ఆశయాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు. కార్మిక, బడుగు బలహీన వర్గాల సమస్యలను తెలుసుకొని ప్రజా సమస్యలను తీర్చే విధంగా నిరంతరం ఉద్యమాల సారథిగా నడిపించిన నాయకుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో విష్ణు, హమాలి సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వాసవీమాతకు పూజలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో వాసవీ మాత జయంతిని పురస్కరించుకొని బుధవారం అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి మూల విరాట్‌కు అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర, సహస్ర నామాలు జపించారు. అనంతరం కోటి గౌరమ్మ పూజలో భాగంగా పసుపు ముద్దతో గౌరమ్మను సామూహికంగా పూజించడంతో పాటు కుంకుమార్చనలు చేశారు. అదేవిధంగా బ్రహ్మంగారి కాలనీలో వీర బ్రహ్మేంద్రస్వామి ఆరాధన జయంతి వేడుకలను ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



అమరచింతలో పూజల్లో పాల్గొన్న మహిళలు

అమరచింత: మండల కేంద్రంలో శ్రీవాసవిమాత జయంతి ఉత్సవాలను ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించి, భక్తి గీతాలు ఆలపిస్తూ అమ్మవారిని స్తుతించారు. అనంతరం పూజ కార్యక్రమాల్లో పాల్గొన్న వారికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బీమ పండరయ్య, ఆర్యవైశ్య మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు బౌరుశెట్టి శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

మగ్గం అల్లికల శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పాన్‌గల్: మండల కేంద్రంలో బ్యాంకర్ల గ్రామీణ మరియు హౌస్ సహాయకుల అభివృద్ధి సంస్థ బైరెడ్ వారి సహకారంతో బ్రెడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళల నుంచి జర్దోసి మగ్గం అల్లికల శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కోఆర్డినేటర్ సత్తయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 19 ఏళ్ల నుంచి 45 వయస్సు ఉండి ఆసక్తి గల మహిళలు ఈనెల 8వ తేదీ నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. మూడు ఫొటోలు, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు దరఖాస్తు కాపీకి జత చేయాలని సూచించారు. ఎంపికైన మహిళలకు 45 రోజుల పాటు అందజేసే శిక్షణలో భాగంగా ఉచిత భోజనం, మెటీరియల్ అందజేస్తారన్నారు. శిక్షణ పూర్తైన తర్వాత ప్రభుత్వమే ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు 99491 04515 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలు తిప్పికొట్టండి



వనపర్తిలో కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

వనపర్తి రూరల్: ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనేందుకు బుధవారం మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) అనుబంధంతో వనపర్తి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కార్మికులు వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు పుట్ట ఆంజనేయులు మాట్లాడుతూ నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేయొద్దని, కార్మికులను బానిసలుగా మార్చొద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు గద్దం కురుమయ్య, బాలయ్య, లాలు, గోపాల్, శాంతయ్య, విజయ్ పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఆత్మకూర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ ప్రజలకు మోసం చేస్తుందని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి ఆర్‌ఎన్ రమేష్, సీపీఎం మండల కార్యదర్శి రాజు అన్నారు. ఈ నెల 20న జరిగే సమ్మెలో భాగంగా ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మమ్మకు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. పెట్టుబడిదారులకు అనుకూలంగా చట్టాలను మార్చిన బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెకు కార్మికులు, కర్షకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

భూసార పరీక్షలపై అవగాహన

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మాచినేనిపల్లిలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి రేవతి ఆధ్వర్యంలో భూసార పరీక్షలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భూసార పరీక్ష సేకరణ, భూసార పరీక్షల లాభాల గురించి రైతులకు వివరించారు. ఏ పంటకు ఎంత మోతాదులో ఎరువులు ఉపయోగించాలో భూ సార పరీక్షల ద్వారా తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో మన గ్రామోర్ ప్రతినిధులు నరేష్, రైతులు అలివేలమ్మ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల నియంత్రణ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

అమరచింత: గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా గ్రామంలో జరిగే తగాదాలు, చోరీలను అరికట్టవచ్చని ఎస్‌ఐ సురేష్ అన్నారు. మండలంలోని ఈర్లదిన్నెలో బుధవారం సీసీ కెమెరాల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన వీధుల వెంట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఆయా కాలనీలో జరిగే అసాంఘిక కార్యక్రమాలను నిలువరించే అవకాశం ఉందన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని తెలిపారు. ప్రజలు, యువకులు స్వచ్ఛందంగా విరాళాలు అందించి వేగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

తాగునీటి ఎద్దడిపై చర్యలు శూన్యం

రాజోళి: గ్రామాల్లో నెలకొన్న తాగునీటి ఎద్దడిపై ప్రభుత్వ చర్యలు శూన్యమని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చాలా గ్రామాల్లో మూడు రోజులకొకసారి కూడా తాగునీరు రావడం లేదన్నారు. తాగునీటి ఎద్దడిపై అధికారులు, అధికార పార్టీ నాయకుల చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌కు నిప్పు.. పోలీసులకు ఫిర్యాదు

మల్దకల్: గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌కు నిప్పుపెట్టిన ఘటన మండలంలోని విఠలాపురం గ్రామంలో బుధవారం చేసుకుంది. బాధిత రైతు ఆనంద్ తెలిపిన వివరాలు.. రోజులానే వ్యవసాయ పనులు ముగించుకొని పొలం వద్దనే ట్రాక్టర్‌ను మంగళవారం రాత్రి ఉంచి ఇంటికి వెళ్లాడు. బుధవారం ఉదయం వ్యవసాయ పొలానికి వెళ్లగా ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైనట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు



పాన్‌గల్‌లో ధాన్యం పరిశీలిస్తున్న ఏఓ రాజవర్ధన్‌రెడ్డి

పాన్‌గల్: కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణలో నిర్వాహకులు రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని ఏఓ రాజవర్ధన్‌రెడ్డి సూచించారు. బుధవారం మండల కేంద్రంతో పాటు కొత్తపేట, కేతేపల్లి గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను ఏఈఓలతో కలిసి ఏఓ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చేటప్పుడు తాలు లేకుండా చూడాలని, తాలు ఉన్న ధాన్యం కాంటా చేస్తే మిల్లర్లు కొర్రిలు పెడుతున్నారన్నారు. దీంతో పాటు కేంద్రాల్లో నీడ, తాగునీరు వంటి వసతులు తప్పక ఉండాలని ఆయన సూచించారు.

శాగాపూర్‌తండాలో కేంద్రం ప్రారంభం

మండలంలోని శాగాపూర్‌తండాలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని బుధవారం సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ భాస్కర్‌యాదవ్ ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి, అల్లూరికి ఘన నివాళి



వీరబ్రహ్మేంద్ర స్వామి, అల్లూరి సీతారామరాజు చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న నాయకులు

వనపర్తి టౌన్: కాలజ్ఞానాన్ని ప్రబోధించి, మానవ జాతి అంత సమానమని చెప్పి తాను ఆచరించి చూపించిన దివ్య శక్తి పారాయణుడు వీర బ్రహ్మేంద్రస్వామి అని మహనీయుల స్ఫూర్తివేదిక రాష్ట్ర చైర్మన్ రాజారామ్‌ప్రకాశ్ అన్నారు. ఒంటరిగానే బ్రిటిషర్లను గడగడలాడించిన అల్లూరి సీతారామరాజు పోరాటాలు మరువలేనివని పేర్కొన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో వీరబ్రహ్మం 332వ ఆరాధన ఉత్సవాన్ని, అల్లూరి సీతారామరాజు 101వ వర్ధంతిని పురస్కరించుకొని వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయవాది ఉత్తరయ్య, కవులు, నాయకులు గిరిరాజాచారి, మండ్ల దేవన్న నాయుడు, గంధం నాగరాజు, శ్రీనివాసులు, కంచె రవి, వెంకటేష్, బండారు శ్రీనివాసులు, కురుమూర్తి, వెంకటస్వామి, నరసింహ, రంగన్న, రమేష్, రంగస్వామి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

‘ఆపరేషన్ సింధూర్’పై సంబరాలు



శివాలయంలో పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు, గ్రామస్తులు

ఖిల్లాఘనపురం: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో మతం పేరుతో 28 మందిని కాల్చి చంపిన పాక్ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయంలో బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు బుచ్చిబాబుగౌడ్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం పీఓకే, పాకిస్తాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను గుర్తించి బుధవారం తెల్లవారుజామున దాడి చేసి ధ్వంసం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. ఉగ్రవాదుల చేతిలో మృతి చెందిన వారికి ఆత్మశాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు రవినాయక్, మండల ప్రధాన కార్యదర్శులు దశరథం, గోపాల్‌రెడ్డి, శంకర్‌నాయక్, ఏబీవీపీ నాయకులు రమేష్‌గౌడు, బూత్ అధ్యక్షుడు రాజు, అశోక్, చెన్నయ్య, పెద్ద శేషయ్య, యాదమ్మ, బుచ్చమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాసిరకం విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దు



సమావేశంలో వ్యవసాయ అధికారులు

కొల్లాపూర్: నాసిరకం ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు విక్రయిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ ఇన్‌చార్జ్ ఏడీఏ. చిన్నహుస్సేన్ యాదవ్ సీడ్స్, పెస్టిసైడ్స్, ఎరువుల డీలర్లకు సూచించారు. బుధవారం పట్టణంలోని రైతు వేదిక భవనంలో డివిజన్ పరిధిలోని డీలర్లతో ఆయన సమావేశం అయ్యారు. వానాకాలం సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలను ఎమ్మార్పీ ధరల ప్రకారం విక్రయించాలన్నారు. స్టాక్ వివరాలను తప్పనిసరిగా స్టాక్‌బోర్డులో రోజువారీగా నమోదు చేయాలన్నారు. ఫర్టిలైజర్‌ను పీఓఎస్ ద్వారానే అమ్మాలన్నారు. సమావేశంలో ఏఓలు శిరీష, వికాస్, ఏఈఓ సూర్యతేజ తదితరులు ఉన్నారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు



పెద్దపోతులపాడులో పాఠశాల ఆవరణలో నిర్మించిన క్రీడా ప్రాంగణం

- గ్రామాలకు దూరంగా ఏర్పాటు
- అందుబాటులో లేని క్రీడా సామగ్రి

మానవపాడు: గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిరుపయోగం మారాయి. ఎకరా స్థలంలో రూ.3 నుంచి 5 లక్షల వరకు వెచ్చించి నిర్మించిన ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా, సరైన మౌలిక సదుపాయాలు లేక అలంకార ప్రాయంగా మారాయంటూ మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

14 గ్రామాల్లో ఏర్పాటు

మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో 14 గ్రామాల్లో గ్రామీణ క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. పల్లెపాడు, చంద్రశేఖర్‌నగర్ ప్రభుత్వ స్థలం అందుబాటులో లేక ఏర్పాటు చేయలేదు. ప్రాంగణాలు గ్రామాలకు దూరంగా, మరికొన్ని చోట్ల పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేశారు. ఈ మైదానాల్లో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, లాంగ్‌జంప్, వంటి క్రీడలకు సంబంధించిన క్రీడా సామగ్రి ఇంత వరకు సమకూర్చలేదు. పేరుకే క్రీడా ప్రాంగణాలని బోర్డులు పెట్టి అధికారులు చేతులు దులుపుకున్నారని క్రీడా కారులు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామానికి దూరం...

గ్రామాలకు దూరంగా ప్రాంగణాలు ఏర్పాటు చేయడం ద్వారా యువతలో క్రీడలపై ఆసక్తి లోపించింది. మరికొన్ని చోట్ల పాఠశాలల ఆవరణలో ఉండటం ద్వారా తరగతులు బోధించేటపుడు ఆటలు ఆడటం ఎలా అని క్రీడాకారులు ప్రశ్నిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో క్రీడా ప్రాంగణాలను ఎక్కడ పడితే అక్కడ నిర్మించారని మండిపడుతున్నారు.

క్రీడా సామగ్రి కరువు..

క్రీడా ప్రాంగణాల్లో క్రీడా సామగ్రి కూడా అందుబాటులో ఉంచకపోవడంపై క్రీడా కారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి క్రీడా ప్రాంగణాల్లో క్రీడా సామగ్రితోపాటు మౌలిక వసతులు కల్పించాలని గ్రామీణ క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడలకు దూరమవుతున్నారు..



గ్రామీణ ప్రాంతాల్లో అనేక మంది యువత మైదానాలు లేక క్రీడలకు దూరమవుతున్నారు. అసంపూర్తిగా ఉన్న క్రీడా ప్రాంగణాలను పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి. యువత ఉత్సాహంగా ఉన్నా వసతులు అందుబాటులో లేవు.

–మోహన్‌బాబు క్రీడాకారుడు చెన్నిపాడు

పాఠశాలలోనే క్రీడా ప్రాంగణాలు



క్రీడా ప్రాంగణాలను పాఠశాలల ప్రాంగణాల్లో ఏర్పాటు చేయడంతో నిరుపయోగంగా మారాయి. ప్రజలకు అందుబాటులో ఉండే స్థలాల్లో ప్రాంగణాలు నిర్మిస్తే బా గుండేది. ఉన్నతాధికారులు చర్య లు తీసుకొని ప్రాంగణాల్లో సౌకర్యాలు కల్పించాలి.

– సూరి కొర్విపాడు